క్లుప్తంగా

14 నుంచి పాలీసెట్ ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షకు సిద్ధమయ్యే విద్యార్థులకు జిల్లా పద్మశాలీ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఆసక్తి గల పద్మశాలీ విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోపా కార్యదర్శి చందర్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 98662 28784, 94931 11334 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డైరీ ఆవిష్కరణ



తంగళ్లపల్లి: పాత్రికేయుల సమస్యలు పరిష్కరిస్తామని అర్హులైన జర్నలిస్టులు అందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తామని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణ అన్నారు. ఆదివారం ఇల్లంతకుంటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ–2024 డెయిరీని ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి వెంకట రమణా రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐజేయూ మండల అధ్యక్షుడు మారుపాక అనిల్‌కుమార్, ఉమ్మడి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తూంకుంట శ్రీనివాస్ రెడ్డి, రాగటి మహేందర్, రాకం సుమన్, సాదుల నిర ంజన్, పెద్దూరి శ్రీనివాస్, రాజయ్య, బండారి శ్రీనివాస్, గుండ రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ, తదితరులు

ఎల్లారెడ్డిపేట: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఏపీఎం మల్లేశం, ఏఈవో శ్రీశైలం అన్నారు. మండలంలోని బండలింగంపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆదివారం వారు ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఐకేపీ ఆధ్వర్యంలో పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో కేంద్రం ఇన్‌చార్జి ప్రభాకర్‌రెడ్డి, రమ్య, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ వేడుకలు ప్రారంభం



ఎల్లారెడ్డిపేటలో దున్నపోతు ఊరేగింపు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ శివారులోని రైతుల వరప్రదాయని సింగసముద్రం కట్ట మైసమ్మ వేడుకలు ఆదివారం ప్రారంభించారు. కట్టపై ఉన్న మైసమ్మతల్లి ఆలయం వద్ద ఆయకట్టు రైతులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఊరిమీద విడిచిపెట్టిన దున్నపోతును ఊరేగించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, బండారి బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిలీస్టాంపుల కేసులో పోలీసుల విచారణ

• పోలీసుల అదుపులో ఇద్దరు

చందుర్తి: పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీతోపాటు నకిలీ స్టాంపులు తయారు చేసిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని చందుర్తి పోలీసులు విచారిస్తున్నారు. మండలంలోని జోగాపూర్ పంచాయతీ కార్యదర్శి ఎర్రం కవిత సంతకాన్ని ఫోర్జరీ చేశారని గత నెల 23న చందుర్తి పోలీసులను ఆశ్రయించింది. రుణం మంజూరు చేసేందుకు ఫోన్ చేసిన ఫైనాన్స్ సంబంధించిన వ్యక్తి ద్వారా పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ వ్యవహారంలో ప్రధాన పాత్ర పోషించిన మండలంలోని నర్సింగపూర్‌కు చెందిన యువకుడితోపాటు నకిలీస్టాంపులు త యారు చేసిన కరీంనగర్ చెందిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

తంగళ్లపల్లి: మండలకేంద్రానికి చెందిన సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు మాజీ ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పెద్దూరి తిరుపతి బీఆర్‌ఎస్‌ను వీడారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్నకు రాజీనామా లేఖ పంపారు.

ఎండుతున్న 'హరిత' మొక్కలు

• నర్సరీల్లో గ్రీన్ షెడ్‌నెట్‌ల ఏర్పాట్లపై నిర్లక్ష్యం
• మొక్కల ఎదుగుదలపై ఎండల ప్రభావం
• పట్టించుకోని అధికారులు
• సంరక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



గ్రీన్‌షెడ్‌నెట్ లేని బండపల్లి నర్సరీ



తిమ్మాపూర్‌లో ఎండిపోతున్న మొక్కలు

చందుర్తి : ప్రభుత్వం నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు శ్రద్ధ చూపుతున్నా నిర్వాహకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నాటేందుకు గ్రామపంచాయతీల వారీగా నర్సరీల్లో అవసరమైన మొక్కల పెంపకాన్ని చేపట్టారు. నర్సరీల్లో ఎదుగుతున్న మొక్కలకు ఎండ ప్రభావంతో పెరగడం లేదు. వాటి సంరక్షణకు అవసరమైన గ్రీన్ షెడ్ నెట్ (హరిత పందిళ్లు) ఏర్పాటు విషయాన్ని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలంలో 19 నర్సరీలు

మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో హరితహారంలో భాగంగా నాటేందుకు ప్రభుత్వం ఇప్పటికే నర్సరీల్లో మొక్కల పెంకానికి శ్రీకారం చుట్టారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఒక్కో నర్సరీని ఏర్పాటు చేశారు. వీటన్నింటిలోపు లక్షలోపే మొక్కలు పెంచాలని నిర్ణయించారు. ఇప్పటికే అన్ని నర్సరీల్లో విత్తనాలు వేసి నెలరోజులు గడుస్తోంది. కొన్ని నర్సరీల్లో విత్తనాలు మొలకెత్తగా , మరికొన్ని నర్సరీల్లో మొలకెత్తుతున్నాయి. పది రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. దీంతో మొక్కల ఎదుగుదలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

మొక్కల ఎదుగుదలకు..

మొక్కలు త్వరగా ఎదగాలంటే నీరు, నీడసౌకర్యం పర్యవేక్షణ అవసరం. ఎక్కువ ఎండ తగిలితే మొక్కల ఎదుగుదలపై ప్రభావం ఉంటుందని భావించిన ప్రభుత్వం నర్సరీల్లో గ్రీన్‌షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు. కానీ ఎక్కడ హరిత పందిర్లు ఏర్పాటు చేయలేదు. రోజుకూ మూడుసార్లు మొక్కలకు నీరందించాలి. అప్పుడే మొక్కలు ఏపుగా ఎదిగి నాటేందుకు వీలుగా మారుతాయి.

షెడ్‌నెట్‌ల కొనుగోలులో జాప్యం

నర్సరీల్లో మొక్కలకు నీడకోసం ఏటా హరిత పందిర్లు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో వీటిని ఉపాధిహామీ పథకం అధికారులే అందించేవారు. రెండేళ్లుగా వీటి కొనుగోలు బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. గతంలో ఏర్పాటు చేసిన గ్రీన్ షెడ్‌నెట్‌లు ఈదురు గాలులు, వర్షాలకు కొన్ని చినిగిపోయాయి. మిగిలి కొన్ని ఏర్పాటు చేసినా ఈదురు గాలులు, వర్షాలకు తట్టుకునే పరిస్థితి లేదంటున్నారు. అయినా గ్రామపంచాయతీ వారు వాటిని కొనుగోలు చేసేందుకు జాప్యం చేస్తున్నారు. ఎండలు మరింత ముదిరితే మొక్కలు పూర్తిగా ఎండిపోయే అవకాశం ఉందని కూలీలు చెబుతున్నారు.

పంచాయతీలదే బాధ్యత



గ్రామపంచాయతీ నర్సరీల్లో పెంచుతున్న మొ క్కల కోసం షెడ్‌నెట్‌ల కొనుగోలు బాధ్యత పంచాయతీలకే అప్పగించారు. నర్సరీల్లో వారి నెట్‌లను కొనుగోలు చేసి కూలీలతో పందిర్లను వే యించాలి. గతంలో ఉపాధిహామీ పథకం ద్వారా నెట్‌లను అప్పగించే వారు. కానీ ఇప్పుడు వాటి బాధ్యత గ్రామ పంచాయితీలకే అప్పగించారు.

– రాజయ్య, ఉపాధిహామీ ఏపీవో, చందుర్తి

ఆదేశాలు జారీచేశాం



గతంలో 10వేలనుంచి 40 వేల వరకు మొక్కల పెంపకానికి లక్ష్యం ఉంటే ప్రస్తుతం గ్రామ పంచాయతీకి 3వేల నుంచి 5వేలలోపే లక్ష్యం ఉండటంతో పాత నెట్‌లను వినియోగించుకోవాలని సూచించాం. పూర్తిగా లేని చోట కొనుగోలు చేయాలని ఆదేశించాం. రెండు మూడ్రోజుల్లో అన్ని నర్సరీల్లో పందిర్లు వేయిస్తాం.

– బండి ప్రదీప్ కుమార్, ఎంపీవో, చందుర్తి

చేనేత కార్మికులను పట్టించుకోని బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో ఎవరిని పట్టించుకోలేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం నుంచి వస్త్రోత్పత్తి ఆర్డర్లు రాక ఇబ్బందులు పడుతున్నట్లు కేటీఆర్ సిరిసిల్ల రైతు దీక్షలో ఆరోపించడం శోచనీయమన్నారు. కార్మికులకు ఆర్డర్ల పేరుతో ఆ పార్టీ నాయకులు కోట్లు దండుకున్నారన్నారు. చేనేత కార్మికులను రెచ్చగొట్టే విధంగా కేటీఆర్ మాట్లాడడం సరికాదన్నారు. రైతులకు రుణమాఫీ, రైతుబంధు, బోనస్, పంట నష్టపోయిన రైతులకు రూ.25వేల చొప్పున పరిహారం అందించలేదని మాట్లాడడం విడ్డూరమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో కేసీఆర్ కుటుంబం కోట్లాది ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. వారికి రైతుదీక్షలు చేసే నైతిక హక్కు లేదన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పందిర్ల లింగంగౌడ్, నాయకులు బండారి బాల్‌రెడ్డి, రాంరెడ్డి, రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలి



ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లోని ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

ఎల్లారెడ్డిపేట: మండలం నారాయణపూర్‌లో ముస్లింలకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రంజాన్ మత సామరస్యానికి ప్రతీక అన్నారు. హిందూ, ముస్లింలు సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. మండల అధ్యక్షుడు స ద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, రాజేందర్, సుధాకర్ గౌడ్, రాజయ్య, శ్రీని వాస్ రెడ్డి, మహేందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

తడగొండలో..

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ మసీదులో ముస్లింలకు ఎంపీటీసీ సభ్యుడు ఉయ్యాల శ్రీనివాస్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అహ్మద్ హుస్సేన్, ఎండీ హుస్సేన్, హకీం, రహీం, మొయినొద్దీన్, రఫీ, బఫత్, హమీద్ తదితరులున్నారు.

వేములవాడ : పట్టణంలోని సుభాష్‌నగర్, విద్యానగర్, తిప్పాపూర్, న్యూఅర్బన్ కాలనీల్లోని మజీద్‌లలో యువకులు ఇఫ్తార్ విందులు ఇస్తున్నారు. వేములవాడ రాజన్న గుడి ప్రాంతంలో ఉంటున్న పేదలకు మై వేములవాడ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం 150 మందికి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. గత 1076 రోజులుగా అన్నదానం చేస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు మధు మహేశ్, ప్రతాప నటరాజ్, పొలాస రాజేందర్‌లు తెలిపారు.

రైస్ మిల్లులతో రైతులకు మేలు



ముస్తాబాద్: రైస్‌మిల్లుల ఏర్పాటుతో రైతులకు మేలు జరుగుతుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని మోహినికుంటలో ఆదివారం వేంకటేశ్వర రైస్‌మిల్ ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసిందన్నారు. రైస్‌మిల్లు పరిశ్రమలను ప్రోత్సహించి, రైతుల ధాన్యాన్ని త్వరగా కొనుగోలుకు కృషిచేసిందన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు గోపాల్‌రావు, నాయకులు అంజయ్య, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎండతీవ్రతకు చేపలు మృత్యువాత



కోనరావుపేట: ఎండవేడికి చెరువులో చేపలు మృతి చెందుతున్నాయి. మండలంలోని మల్కపేట శివారులోని ఊరచెరువులో ఉన్న కొద్దిపాటి నీరు వేడి అవుతోంది. రెండ్రోజులుగా సుమారు 5 క్వింటాళ్ల చేపలు మృత్యువాత పడడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి శేఖర్ గ్రామానికి చేరుకుని మత్స్య కార్మికులతో మాట్లాడారు. చెరువులో ఉన్న చేపలుపట్టి విక్రయించుకోవాలని సూచించారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి



వీర్నపల్లి : మండలంలోని రాశిగుట్ట తండా, బుగ్గరాజేశ్వరి తండా గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 14 లీటర్ల గుడుంబా వంద లీటర్ల బెల్లం పదికిలోల స్పటిక పదికిలోల ఇప్పపువ్వు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కానిస్టేబుల్ రాజు, కిషోర్, తదితరులున్నారు.

చెత్త వాహనాలకు సుస్తీ

• రిపేరింగ్ పేరుతో మూలనపడ్డ వాహనాలు
• వీధుల్లో పేరుకుపోతున్న చెత్తకుప్పలు
• వ్యాధులబారిన పడుతున్న ప్రజలు



సినారె కళామందిరంలో మూలనపడ్డ చెత్త సేకరణ వాహనం

వేములవాడ: వేములవాడ మున్సిపల్ పరిధిలోని 28 వార్డుల్లో చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాలు కొన్ని మూలనపడ్డాయి. కొద్దిరోజులుగా రిపేరింగ్ పేరుతో సినారె కళామందిరంలో వీటిని ఉంచారు. ఫలితంగా చెత్త సేకరణకు ఇబ్బంది తప్పడం లేదు. కుప్పలు కుప్పలుగా చెత్త పేరుకుపోతోంది. దీంతో దోమలు విజృంభిస్తూ రోగాల బారినపడుతున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రిపేరింగ్ పేరుతో..

వేములవాడ మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు రిపేరింగ్ సౌకర్యం లేకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తక్కువ వాహనాలు చెత్త సేకరణకు తిరుగుతుండటంతో చాలా కాలనీల్లోకి చెత్త వాహనాలు రావడంలేదంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. చిన్న రిపేర్లతోపాటు డ్రైవర్లు అందుబాటులో లేకపోవడం ఇందుకు కారణమని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. మొత్తం ఆరు వాహనాలు పక్కనబెట్టేశారు. మున్సిపల్ వాహనాలు ఆటోలు 25, ట్రాక్టర్లు 7, డోజర్ 1, వైకుంఠరథం 1, స్వీపింగ్ మిషన్ 1, షీ టాయిలెట్ బస్సు ఉంది.

అందుబాటులోకి తెస్తాం

చిన్న రిపేర్లతో పాటు వాహనాలకు సంబంధించిన విడి భాగాలు షోరూంలో లభించకపోవడంతో కొన్ని వాహనాలను పక్కకు ఉన్నాయి. త్వరలోనే వాహనాలకు రిపేర్ పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

– కిరణ్, హెల్త్ అసిస్టెంట్, మున్సిపల్

ఫోన్‌చేస్తే వస్తున్నారు



చెత్త సేకరణకు వచ్చే వాహనాలు సరిగా రావడం లేదు. చాలాసార్లు మున్సిపల్ సిబ్బందికి, కౌన్సిలర్‌కు ఫోన్ చేయాల్సి వస్తోంది. చెత్త సేకరణ నిత్యం చేపట్టాలి. లేకపోతే పలు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

– రజిత, గృహిణి

పేరుకుపోతోంది



చెత్త సేకరణపట్ల మున్సిపల్ శానిటేషన్ విభాగానికి చిత్తశుద్ధి లేదు. ఎక్కడ చూసినా కుప్పలు తెప్పలుగా చెత్త పేరుకుపోతోంది. ఇదేంటని వారని ప్రశ్నిస్తే దాటవేసే ప్రయత్నం చేస్తున్నారు.

– మమత, గృహిణి

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వేములవాడరూరల్: మండలంలోని వట్టెంల శివారులోని పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,420 నగదు, 5 సెల్‌ఫోన్‌లు, ఆరు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారు. ఈ దాడిలో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్ల శివారులోని పుట్టల మల్లన్న ఆలయ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మరిమడ గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి ద్విచక్రవాహనాన్ని హార్వెస్టర్ ఢీకొనడంతో గాయాలుకాగా చికిత్స నిమిత్తం వేములవాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మంత్రి పొన్నంను కలిసిన నాయకులు



మంత్రి పొన్నంతో జిల్లా ఎమ్మెల్యే సత్యం, నాయకులు

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట: ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జిల్లా కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలని, నేతన్నలకు ఉపాధి కల్పించాలని మంత్రిని కోరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, సిరిసిల్ల పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ తొందర్లోనే సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి జిల్లా కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నంను కలిశారు. వారి వెంట వెంకటాపూర్ మాజీ సర్పంచ్ మల్లారెడ్డి ఉన్నారు.

యజమానులు సాంచాలు ప్రారంభించాలి



మాట్లాడుతున్న కటుకం మృత్యుంజయం

సిరిసిల్లటౌన్: వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్య జఠిలం కాదని, యజమానులు త్వరగా సాంచాలు ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ అధికార ప్రతినిధి కటుకం మృత్యుంజయం అన్నారు. ఆదివారం సిరిసిల్లలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పరిశ్రమను ప్రారంభించాలని యజమానులకు పలుమార్లు విన్నవించినట్లు పేర్కొన్నారు. వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పిస్తామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్లలో కేటీఆర్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎంపీగా రెండుసార్లు, సీఎంగా పదేళ్ల పనిచేసిన కేసీఆర్ నేత కార్మికులకు ఏమి చేశారో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, యెల్లె లక్ష్మీనారాయణ, కత్తెర దేవదాసు, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, రాపెల్లి కళ్యాణ్, నీలి రవీందర్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్నకు కన్నీటి వీడ్కోలు



పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల: రాజీవ్‌నగర్‌లో శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డ నేత కార్మికుడు సిరిపురం లక్ష్మీనారాయణ (66)కు ఆదివారం కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లోనే ఉరివేసుకుని ఉసురు తీసుకున్న లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ నాయకులు పరామర్శించారు. లక్ష్మీనారాయణ ఆత్మహత్యకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు జరిగాయి. కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాశ్, మ్యాన ప్రసాద్ తదితరులు నేతకార్మికుడు లక్ష్మీనారాయణ పాడెను మోశారు. కాంగ్రెస్ నాయకులు ఆకునూరి బాలరాజు, యెల్లె లక్ష్మీనారాయణ, స్థానిక కౌన్సిలర్ కొమిరె లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి మోక్షమెప్పుడో ?

• ధర్మారంలో పూర్తయిన సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు
• రెండేళ్లయినా ప్రారంభించకపోవడంతో ఇబ్బంది పడుతున్న రైతులు



కోనరావుపేట: పనులు పూర్తయినా ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. మండలంలోని ధర్మారంలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. పనులు పూర్తయి రెండేళ్లు అవుతున్నా ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేయడం లేదు. దీంతో మూడుగ్రామాల్లో లో వోల్టేజీ సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ధర్మారంలో నిర్మించే 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎన్‌పీడీసీఎల్ నుంచి రూ.1.25 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను 2020 ఫిబ్రవరి 6న అప్పటి ఎమ్మెల్యే రమేశ్‌బాబు పనులను ప్రారంభించారు. పనులు త్వరితగతిన పూర్తయ్యాయి. ఆపరేటర్ల గది, సబ్‌స్టేషన్ మిషనరీలు, రక్షణ వ్యవస్థ తదితర పనులు పూర్తయ్యాయి.

మూడు గ్రామాలకు మేలు..

ధర్మారంలో సబ్‌స్టేషన్ పనులు పూర్తికావడంతో మల్కపేట, ధర్మారం, కనగర్తి గ్రామాలకు ప్రయోజనం కలుగనుంది. ధర్మారంలో 820 గృహ కనెక్షన్లు, 750 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. మల్కపేటలో 754 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. కనగర్తి శివారులోని మూడు రైస్‌మిల్లులకు నిరంతర విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి పనులు పూర్తయ్యాయి. సబ్‌స్టేషన్ ప్రారంభం ఈ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీరుతాయి.

వాహనాల తనిఖీ



చందుర్తి: తనిఖీ చేస్తున్న పోలీసులు

చందుర్తి : చందుర్తి – మల్యాల రోడ్డులో ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలు నగదును రూ.50 వేలలోపే వెంట తీసుకెళ్లాలన్నారు. అంతకన్న ఎక్కువగా నగదు ఉంటే సీజ్ చేస్తామన్నారు. మండలంలో ఎక్కడైనా నగదు, మద్యాన్ని డంప్ చే సినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ముస్తాబాద్: మద్యంతాగి వాహనాలు నడపవద్దని ఎస్సై శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తెర్లుమద్ది చౌరస్తా వద్ద ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్సై మాట్లాడుతూ... వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు.

సంక్షిప్త వార్తలు

బీఆర్‌ఎస్ సభకు తరలిన నాయకులు

ఎల్లారెడ్డిపేట: కరీంనగర్ జరిగిన బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభకు మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆదివారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. తరలివెళ్లిన వారిలో మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సింగారం మధు, నాయకులు అందె సుభాష్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, నర్సింలు, కిషన్, నాగరాజు, దేవరాజు, సతీశ్, తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

బోయినపల్లి: మున్నూరు కాపు సమస్యల పరిష్కారం కోసం మండలంలోని మల్లాపూర్‌లో పటేల్ యూత్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పటేల్ యూత్ గర్జన చలో కరీంనగర్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ మున్నూరు కాపు సంఘం నాయకులు వారాల రవి, ఐల శివరామ్, మహేశ్, రామ్, శ్రవణ్, మోహన్, మనోహర్, మధు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

తంగళ్లపల్లి: మండలంలోని గోపాలరావుపల్లెలో ఇటీవల ప్రారంభమైన ఎసిరెడ్డి మల్లారెడ్డి–నర్సవ్వ స్మారక క్రికెట్ టోర్నమెంట్ జీపీఎల్ సీజన్–1 ఆదివారంతో ముగిసింది. బండలింగంపల్లి టీమ్‌పై గోపాల్‌రావుపల్లె టీమ్ విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సన్నీ నిలిచాడు.మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాజీ సర్పంచ్ ఎసిరెడ్డి రాంరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సతీశ్ యాదవ్, యాదవ సంఘం సొసైటీ అధ్యక్షుడు మిరాల శ్రీనివాస్ యాదవ్, టీం కెప్టెన్ సునీల్, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.